## క్లుప్తంగా

### రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రుణాలు

పద్మనాభం: మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్టు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఏపీఎం ప్రభాకర్ అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు రుణాలకు ఖాతా తెరిచి ఆరు నెలలై ఉండాలన్నారు. పొదుపు చేయాలన్నారు. ఇటువంటి సంఘాలు బ్యాంకు ద్వారా రూ.50వేలు రుణం పొందేందుకు అర్హులన్నారు. ఇప్పటికే పది పంచాయతీల్లో 110 మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయన్నారు. రుణాలతో మేకలు, గొర్రెలు పెంచుకుని ఆర్థికంగా బలోపేతమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ పద్మ పాల్గొన్నారు.

### రోడ్ల మధ్య విద్యుత్ స్తంభాలు తొలగించాలి

తగరపువలస: భీమిలి జోన్ 1, 2 వార్డుల్లో రోడ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతూ బీజేపీ తగరపువలస అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి జీవీఎంసీ కమిషనర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. రోడ్లు నిర్మించడానికి ముందు రహదారుల మధ్యలో ఉన్న స్తంభాలు ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు కూడా అలాగే ఉంచేస్తున్నారని ఆమె తెలిపారు. దీని వల్ల అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. రోడ్ల మధ్య విద్యుత్ స్తంభాలు లేకుండా చూడాలని ఆమె కోరారు. ఆమెతోపాటు నాయకులు కురుమెళ్ల కవిత, వెంకటేశ్వరరావు, మంగవేణి, చిన్నారావు ఉన్నారు.

### వైభవంగా దీపోత్సవం


అష్టలక్ష్మి ఆలయంలో దీపారాధనలో భక్తులు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాస విశేష ఉత్సవాల్లో భాగంగా సోమవారం దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా అష్టలక్ష్మి ఉత్సవమూర్తులను, గోదా అమ్మవారిని మండపంలో పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేశారు.

### ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


గాలిపటాలు ఎగురవేస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భోగి మంట వేసి, ముగ్గులు పెట్టారు. అనంతరం గాలిపటాలు ఎగురవేశారు. కొత్తగా వచ్చిన విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ సంక్రాంతి పండగ మన సంస్కృతిలో భాగమన్నారు. మన పండగుల గొప్పదనాన్ని తెలుసుకుని, గౌరవించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్‌కు జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నగర అథ్లెట్ వై.జ్యోతి పాల్గొనుంది. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు భారత్ తరఫున 13 మంది చొప్పున వుమెన్, మెన్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఎంపిక చేసింది. వంద మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన విశాఖ అథ్లెట్ జ్యోతి జట్టుకు ఎంపికైంది. కజకిస్తాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో 60 మీటర్ల స్ప్రింట్‌తో పాటు 60 మీటర్ల హార్డిల్స్‌లో జ్యోతి పాల్గొనుంది.



# ‘ప్రజా సంకల్పయాత్ర’ గొప్ప సాహసం


సంగివలసలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


భీమిలిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమునిపట్నం: ప్రతిపక్ష నాయకునిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర పేరుతో వేల కిలోమీటర్లు పాదయాత్ర చేయడం గొప్ప సాహసమని, వెలకట్టలేనిదని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. సీఎం జగన్ ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసుకుని నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ఇక్కడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు ఎదురైనా ధీటుగా ఎదుర్కొంటూ పాదయాత్ర పూర్తి చేశారన్నారు. అంతలా ప్రజలతో మమేకమవడం వల్లే అఖండ విజయాన్ని అందించారని, దానికి తగిన విధంగానే అద్భుతమైన పాలనను అందిస్తూ అందరి మన్ననలు ముఖ్యమంత్రి జగన్ పొందుతున్నారన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు, ఆరోపణలు చేసినా ప్రజల గుండెల్లో సీఎం జగన్ ఉన్నారని... తిరిగి ఆయనే ఘన విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసుపల్లి కొండబాబు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, వాసుపల్లి ఎల్లాజీరావు, సిల్ల కరుణాకరరెడ్డి, అక్కరమాని రామునాయుడు, బాకి రమణారెడ్డి, జగ్గుపల్లి ప్రసాద్, డింగి దుర్గారెడ్డి, చిప్పాడ వెంకటేష్ పాల్గొన్నారు.

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తి చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, సీనియర్ నాయకుడు జీరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకల్లో జీరు వేణుగోపాలరెడ్డి, నీలాపు శివశంకరరెడ్డి, అక్కరమాని దుర్గ, నమ్మి రమణ, కోల గిరిబాబు, కంచుమాని రాంబాబు, అల్లు బంగారి, రవి, దినేష్ పాల్గొన్నారు.

## తాళ్లవలసలో సామూహిక సీమంతాలు


సామూహిక సీమంతాలు జరుపుతున్న మానవత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వైద్యుడు ఏటీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు, రక్త తనిఖీలు సోమవారం నిర్వహించారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం మధురవాడకు చెందిన మానవత సేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు 30 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపించారు. అనంతరం వారికి పౌష్టికాహార కిట్లు, భోజనం అందించారు. ఆస్పత్రిలో ప్రసవించిన ఒక మహిళకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అరుణ, సభ్యులు శోభారాణి, నాగమణి, ఉషారాణి, ఎల్మాజీ, డీపీఎంవో భీమేశ్వరరావు, ఎంపీహెచ్ఏ తారకేష్, యూడీసీ రవికుమార్, ఎంపీహెచ్ఈవోలు రాజ్‌కుమార్, హెచ్‌వీ సరళకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ‘కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి’


మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు


బైపాస్ రోడ్డు ఈఎస్‌ఐ సర్కిల్ వద్ద మానవహారంగా పారిశుధ్య కార్మికులు

తగరపువలస: జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భీమిలి జోన్‌లో పారిశుధ్య కార్మికులు ఒక్క రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం చేపట్టారు. అనంతరం బైపాస్‌రోడ్డు ఈఎస్ఐ సర్కిల్ వద్ద నిర్వహించిన మానవహారంలో భీమిలి జోన్ సిటు అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడారు. ప్రభుత్వానికి, ఎంప్లాయీస్ యూనియన్‌కు జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించి కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేస్తూ రక్షణ పరికరాలు, సబ్బులు, నూనె, చెప్పులు, గ్లౌజ్‌లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు, యూనియన్ నాయకులు బండి రాజు, ముక్కి శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ: మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ గ్రేటర్ విశాఖ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఒక్క రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జోన్ కార్యాదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. క్లాప్ వెహికల్ డ్రైవర్లకు జీవో నంబర్ 7 ప్రకారం రూ.18,500 వేతనం, రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల వారసులకు 482, వాటర్ వర్క్స్ కార్మికులకు 97 పోస్టులు కేటాయించాలని కోరారు. నాయకులు శేషు, విజయ్ పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

పీఎం పాలెం/మధురవాడ: నగర పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై మరింత అవగాహన కల్పించడానికి నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో ఫుటేజీని చంద్రంపాలెం హైస్కూల్‌లో సోమవారం ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులకు తెలియజేయాలని కోరారు. స్థానిక ఏఎస్ఐ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సమస్యలపై వినతి

తగరపువలస: స్థానిక ప్రధాన రహదారిలో విపరీతమైన ట్రాఫిక్ సమస్యల కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని... ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్ సోమవారం భీమిలి జెడ్సీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. డివైడర్లు, ఫుట్‌పాత్‌లు వ్యాపారుల ఆక్రమణలో ఉండడంతో ఆరు మండలాలకు కేంద్రమైన తగరపువలసలో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతుందన్నారు. దీంతో కూడలి మీదుగా రాకుండా సిటీ సర్వీసులు బైపాస్ మీదుగా వెళ్లిపోతున్నాయన్నారు. సిటీ సర్వీసులు అంబేడ్కర్ కూడలి, ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగించేలా చూడాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

### 13న ముగ్గుల పోటీలు

మధురవాడ: సంక్రాంతి పండగ సందర్భంగా మధురవాడ జీవీఎంసీ కార్యాలయం పక్కన ఉన్న సిద్ధేశ్వర స్వామి పీఠంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు ధర్మకర్త నరసింహమూర్తి చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించే పోటీల్లో పాల్గొనాలనుకునే మహిళలు ఆలయంలో లేదా 98499 22164లో సంప్రదించాలని సూచించారు. సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# అధ్వానంగా ఆర్టీవో కార్యాలయం రోడ్లు


రాళ్లుతేలి అధ్వాన స్థితిలో ఉన్న రోడ్డు

- పేరుకుపోయిన మట్టి, బురద
- వాహనదారులకు తప్పని అవస్థలు


తుప్పలతో నిండి ఉన్న టెస్ట్ ట్రాక్

ఆనందపురం : మండలంలోని గంభీరంలో రోడ్డు రవాణా సంస్థ ఏర్పాటు చేసిన డ్రైవింగ్ టెస్ట్ సెంటర్ రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో సందర్శకులు పడరాని పాట్లు పడుతున్నారు. టెస్ట్ సెంటర్‌ని కొండవాలు ప్రాంతంలో నిర్మించారు. డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఇటీవలే ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ని ఏర్పాటు చేశారు. కాగా ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొండ పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో కార్యాలయానికి వేసిన రోడ్లు, ట్రాక్‌లు కోసం ఏర్పాటు చేసిన రోడ్లు చాలా వరకు కొట్టుకుపోయాయి. కార్యాలయం ప్రధాన ప్రవేశ మార్గం ఎత్తులో ఉంది. ఇక్కడ వాహనాల ప్రవేశాలకు, నిష్క్రమణకు రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. అయితే నిష్క్రమణ మార్గం ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో భారీ వాహనాలు గోతులలో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ఒక మార్గంలోనే వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది. అలాగే భారీ వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ కోసం ఏర్పాటు చేసిన ట్రాక్ తుప్పలతో నిండి ఉంది. వరదకు కొట్టుకొచ్చిన బురద పేరుకుపోయి ఉంది. కార్యాలయానికి వెళ్లే ప్రధాన మార్గం పూర్తిగా దెబ్బతిని రాళ్లు తేలి ఉన్నాయి. తారురోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. మార్గంలో కొన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక పేరుకుపోయి ఉంది. దీంతో టెస్ట్ డ్రైవింగ్‌కు వచ్చిన వారు, ఫిట్‌నెస్ కోసం వాహనాలు తీసుకొచ్చే వారు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడకు వచ్చే వాహనదారులు లోపలికి వెళ్లి బయటకు రావడమే పెద్ద పరీక్షగా భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడి రోడ్లను మెరుగుపరచాలని వాహన చోదకులు కోరుతున్నారు.


టెస్ట్ ట్రాక్‌పై పేరుకుపోయిన బురద

### పబ్లిక్ డిమాండ్

### రహదారులకు అరకొరగా మరమ్మతులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 8వ వార్డు పీఎం పాలెం సమీప పీర్‌లెస్ కాలనీ రహదారులకు పూర్తిగా మరమ్మతులు చేపట్టాలి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న ఈ రహదారిలో ఇటీవల అక్కడక్కడ మరమ్మతులు చేసి మరికొన్ని చోట్ల వదిలేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడంతో తరచూ గోతులలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలి.

– వి.అప్పారావు, పీర్‌లెస్ కాలనీ, 8వ వార్డు.


పీఎం పాలెం పీర్‌లెస్ కాలనీ రహదారిపై గుంతలు

## రమణకు వీల్‌చైర్, నిత్యావసర సరకులు అందజేత

సాక్షి ఎఫెక్ట్..


రమణకు వీల్‌చైర్, నిత్యావసర సరకులు అందిస్తున్న దాతలు

తగరపువలస: లారీ ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన కుప్ప రమణకు తగరపువలసకు చెందిన తాటిశెట్టి కార్తీక్ వీల్‌చైర్, నిత్యావసర సరకులు అందించారు. ‘సాక్షి’లో సోమవారం ప్రచురించిన ‘రోడ్డున పడిన పేద కుటుంబం’ వార్తకు పలువురు స్పందించారు. తన తండ్రి చిన్ని జ్ఞాపకార్థం చేసే సేవా కార్యక్రమాల్లో భాగంగా రమణకు ఈ సాయం అందించినట్టు కార్తీక్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్, మాజీ సర్పంచ్ పల్లా వెంకటరావు, ఎల్లారమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజగిరి కృష్ణారావు, పిల్లా రాజేష్, పొట్నూరు వాసు, రాజగిరి సురేష్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు. వుయ్ కేర్ యూ ఫౌండేషన్ తరఫున రమణ కుటుంబానికి తగరపువలసకు చెందిన వెంపాడ శ్రీనివాసరెడ్డి నిత్యావసర సరకులు, బియ్యం ప్యాకెట్ అందించారు.

## అనంతుని ఆలయ అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో నానాజీ బాబు

పద్మనాభం: పద్మనాభంలో గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని పద్మనాభం గ్రూపు టెంపుల్ ఈవో ఎస్.నానాజీ బాబు అన్నారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం ఆలయాల అభివృద్ధిపై రైతులు, భక్త బృందం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి రెండు నుంచి 8 వరకు జరగనున్న అనంతుని కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. అనంతుని భూములు సాగు చేసుకుంటున్న రైతులు శిస్తులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, తాలాడ నరసింహనాయుడు, బోని సన్యాసినాయుడు, గంగిరెడ్ల పద్మనాభ స్వామి, భక్త బృందం సభ్యులు కనకల కోటి, తాలాడ పైడినాజు పాల్గొన్నారు.

## పార్కు స్థలం పరిరక్షణలో అలసత్వం తగదు


పార్కు ఆక్రమణపై జెడ్సీ కనకమహాలక్ష్మికి వివరిస్తున్న బింద్రానగర్ వాసులు

మధురవాడ: ప్రభుత్వ పార్కు స్థలం పరిరక్షణ విషయంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని, ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ 8వ వార్డు షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్ కాలనీ వాసులు కోరారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ కొట్యాడ కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి మూడు అర్జీలు స్వీకరించారు. ఆర్‌జీకే కాలనీలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని, పీఎమ్‌పాలెంలో మురుగునీటి గుంట తొలగించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.రమేష్, డీఈ శ్రీహరి, సూపరింటెండెంట్ అప్పలరాజు, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

**జెడ్సీకి అభినందనలు**

జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కొట్యాడ కనక మహాలక్ష్మిని యూసీడీ విభాగం సీవోలు, ఆర్‌పీలు సోమవారం ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, డ్వాక్రా సంఘాలు సక్రమ నిర్వహణకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యమండలి ప్రయోగ కేంద్ర నమూనాతో సాగు


సూర్యమండలి ప్రయోగ కేంద్రం నమూనాతో సాగు చేస్తున్న ఆకుకూరలు

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేటలో జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ సూర్యమండలి ప్రయోగకేంద్ర నమూనా ద్వారా ఆకుకూరలు, కూరగాయల సాగు చేయిస్తోంది. 25 సెంట్లు (పావు ఎకరం) విస్తీర్ణంలో 19 రకాల ఆకుకూరలు, కాయగూరలు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రెనీల ద్వారా ఏడాది పొడవునా పండేలా చూస్తున్నారు. ఈ స్థలాన్ని సెక్టార్లుగా విభజించి సూర్యుని చుట్టూ గ్రహాలుగా వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు చిన్న మడుల ద్వారా వేస్తున్నారు. ఈ నమూనా ద్వారా అన్ని రకాల పంటల మీద నెలకు రూ.15వేలు వంతున ఏడాదికి రూ.1.80 లక్షలు ఆదాయం తీయవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా యూనిట్ ఇన్‌చార్జి బి.వెంకటరమణ తెలిపారు. ప్రస్తుతం ఈ సూర్యమండలి నమూనా సాగు ద్వారా పాలకూర, మెంతికూర, తోటకూర, గోంగూర, ఉల్లి, కొత్తిమీర, టమోటా, మిరప, కాలీఫ్లవర్, అరటి, ముల్లంగి, బచ్చలికూర, వంగ, కాకర, బీర, జొన్న, చుక్కకూర, కీర, బంతి పువ్వులు సాగు చేస్తున్నారు. మనిషికి అవసరమైన అన్ని పోషకాలతో కూడిన కూరగాయలు, ఆకుకూరలు ఏడాది పొడవునా అందించే లక్ష్యంతో వీటిని పరిరక్షిస్తున్నారు. ఇదే నమూనాను ఆనందపురం, పద్మనాభం మండలంలోని పలువురు రైతులు ఆచరిస్తున్నారు. వసతిగృహాలు, ఉమ్మడి కుటుంబాలు ఉన్నవారు బయట కూరగాయలు కొనుగోలు చేయకుండా రోజూ 50 నుంచి 100 మందికి ఈ నమూనా ద్వారా ఆరోగ్యకరమైన ప్రకృతి సాగు ఉత్పత్తులు తీయవచ్చని నిపుణులు అంటున్నారు.

## భీమిలి రోడ్డుపై పశువుల తిష్ట


చిల్లపేట చెరువు వద్ద భీమిలి రోడ్డుపై అడ్డంగా పశువులు

తగరపువలస: తగరపువలస నుంచి భీమిలి వెళ్లే రోడ్డుపై అడుగడుగునా తరచూ పశువులు తిష్టవేసి వాహనాలకు గండంగా మారుతున్నాయి. ముఖ్యంగా చిల్లపేట చెరువు, జీరుపేట, చిల్లపేట, రాయపాలెం కూడలి, బ్యాంకు కాలనీ వద్ద రోడ్డుపై పశువులు స్పీడ్‌బ్రేకర్లుగా మారి ఇబ్బంది పెడుతున్నాయి. పగలే కాకుండా సాయంత్రం చీకటిపడిన తర్వాత కూడా రోడ్డుపై అడ్డంగా పడుకునే పశువులు మంచు కారణంగా వాహనదారులకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులపై ఇవి కొమ్ములు విసురుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపైకి పశువులు రాకుండా నిరోధించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఇరువర్గాల మధ్య కొట్లాట

తగరపువలస: భీమిలి మండలం గొల్లల్ల తాళ్లవలసలో స్థల వివాదంపై సోమవారం ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో అయిదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సర్వే నంబర్ 199/2లో 4.13 ఎకరాల స్థలం తమదని తాళ్లవలసకు చెందిన అక్కరమాని తోటయ్య వర్గం వాదిస్తుండగా నగరానికి చెందిన మరో వర్గం తమదని కొన్ని రోజులుగా బలప్రయోగం ద్వారా నిరూపించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో తోటయ్య వర్గానికి చెందిన మహిళలు అక్కరమాని రామయ్యమ్మ, చిన్నమ్మ, నూకమ్మ, సింహాచలం గాయపడి భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరానికి చెందిన మరో వర్గానికి చెందిన వ్యక్తి గాయపడినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇరువర్గాలు భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా సీఐ కె.లక్ష్మణమూర్తి విచారిస్తున్నారు.

### కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

పద్మనాభం: పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట నిషేధించామని సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. ఎవరైనా నిర్వహించినా, పాల్గొన్నా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని సోమవారం ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు.